
సాక్షి బాపట్ల

మంగళవారం । 7 । మార్చి । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 2,212 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1050 క్యూసెక్కులు విడుదల చేశారు.



పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.4733 టీఎంసీలు ఉంది. ఎగువ నుంచి రెండు వేల క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా 2,200 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: గుంటూరు జిల్లా వ్యాప్తంగా శనివారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. అలాగే జిల్లాలో మరణాలు కూడా ఎక్కడా లేవని వైద్య వర్గాలు తెలిపాయి.

న్యూస్‌రీల్

యార్డులో 1,15,459 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,18,338 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,15,459 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.26,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 76,061 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఉపాధ్యాయులతో మర్యాదగా మెలగండి

పల్నాడు డీఈవోకు జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా సూచన

గుంటూరుఎడ్యుకేషన్: ఉపాధ్యాయులను వ్యక్తిగతంగా దూషించారనే కారణంతో ఉపాధ్యాయలోకం నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటున్న పల్నాడు డీఈఓ ఎం.వెంకటప్పయ్య సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినాను కలిశారు. గుంటూరులోని జెడ్పీ క్యాంపు కార్యాలయంలో హెనీ క్రిస్టినాను కలిసిన వెంకటప్పయ్య ఈనెల 3వ తేదీన జరిగిన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశానికి గైర్హాజరు కావడంపై ఆమెకు వివరణ ఇచ్చారు. ఇటీవల వినుకొండ మండలంలో నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యాయులను వ్యక్తిగతంగా దూషించిన అంశంపై చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సైతం ప్రభుత్వంలో భాగమేనని, వారితో హుందాగా నడుచుకోవాలని సూచించారు. స్థాయీ సంఘ సమావేశాలకు అన్ని శాఖల అధికారులతో పాటు విధిగా హాజరు కావాలని, ప్రోటోకాల్‌ను ఖచ్చితంగా అమలు పర్చాలని స్పష్టం చేశారు.

కింది కోర్టు శిక్షను ఖరారు చేసిన సుప్రీంకోర్టు

తెనాలిరూరల్: జిల్లా, హైకోర్టులు విధించిన శిక్షను సుప్రీంకోర్టు ఖరారు చేసింది. కింది కోర్టులు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని ఆదేశించింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొల్లిపరకు చెందిన తమ్మా ఉషారాణి, ఆమె మరిది తమ్మా వెంకటకృష్ణారెడ్డికి ఆస్తి విషయమై వివాదం ఉంది. ఈ నేపథ్యంలో ఉషారాణి సాగు చేస్తున్న అరటి, కంద పంటను 2010లో కృష్ణారెడ్డి కోసుకుని తీసుకెళుతుండగా ఆమె అడ్డుపడింది. ఆమెపై దాడి చేయగా పోలీసులను ఆశ్రయించింది. కొల్లిపర పోలీసులు కేసు నమోదు చేయగా, 11వ అదనపు జిల్లా కోర్టులో నిందితుడికి మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. జిల్లా కోర్టు తీర్పును సవాలు చేస్తూ కృష్ణారెడ్డి హైకోర్టును ఆశ్రయించగా, కింది కోర్టు శిక్షను న్యాయస్థానం ఖరారు చేసింది. హైకోర్టు తీర్పునూ సవాలు చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లగా అక్కడా కింది కోర్టు శిక్షను అమలు చేయాలని తీర్పు వచ్చింది. కృష్ణారెడ్డిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్టు కొల్లిపర ఎస్‌ఐ ఆర్.రవీందర్‌రెడ్డి తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు

జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్



నృసింహుని బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్

మంగళగిరి: నగరంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ తెలిపారు. సోమవారం రాత్రి స్వామి వారి కల్యాణ మహోత్సవం, మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు స్వామి వారి దివ్య రథోత్సవం నేపథ్యంలో ఎస్పీ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎ రామకోటిరెడ్డి, అడిషనల్ ఎస్పీ అనిల్, డీఎస్పీ జె రాంబాబు, పట్టణ సీఐ బి అంకమ్మరావు, ఎస్‌ఐలు మహేంద్ర, నారాయణ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

- ఎన్నికల కమిషన్‌కు మైక్రో అబ్జర్వర్లు కీలకం
- ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు కోన శశిధర్, కాటంనేని భాస్కర్



ఎమ్మెల్సీ ఎన్నికల మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు కోన శశిధర్, కాటంనేని భాస్కర్, ప్రకాశం, బాపట్ల జిల్లాల కలెక్టర్లు ఏఎస్.దినేష్‌కుమార్, విజయకృష్ణన్, ప్రకాశం, బాపట్ల జిల్లాల ఎస్పీలు మల్లికాగర్గ్, వకుల్‌జిందాల్ తదితరులు

ఒంగోలుఅర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల పరిశీలకులు జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. సోమవారం స్పందన భవనంలో ప్రకాశం, బాపట్ల జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఉపాధ్యాయ నియోజకవర్గం పరిశీలకులు కోన శశిధర్, పట్టభద్రుల నియోజకవర్గ పరిశీలకులు కాటంనేని భాస్కర్ పాల్గొని పలు సూచనలు చేశారు. కాటంనేని భాస్కర్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరగడంలో ఎలక్షన్ కమిషన్‌కు మైక్రో అబ్జర్వర్లు కీలకంగా వ్యవహరిస్తారన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలే ప్రామాణికమన్నారు. నిబంధనల మేరకు ఎన్నికల ప్రక్రియ జరగడంలో లోపాలు, ఉల్లంఘనలు ఉంటే వాటిని వెంటనే పైస్థాయి అధికారులకు తెలపాలన్నారు. ఎన్నికలకు ముందు రోజే పోలింగ్ కేంద్రానికి చేరుకుని అక్కడి పరిస్థితులు, సౌకర్యాలను పరిశీలించాలని సూచించారు. రాత్రికి అక్కడే బస చేయాలన్నారు. కోన శశిధర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి కేటాయించిన విధులను సమర్థంగా నిర్వహించాలన్నారు. ప్రిసైడింగ్ అధికారుల పట్ల గౌరవంగా ఉండాలన్నారు. మౌలిక, భద్రతాపరమైన లోపాలు గమనిస్తే వాటిని సరిచేయాలన్నారు. మైక్రో అబ్జర్వర్లు సకాలంలో స్పందించడం ఎంతో కీలకమన్నారు. ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యలు, పీవోలకు, ఏపీవోలకు ఇచ్చిన శిక్షణలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రిని సిద్ధం చేస్తున్న విధానం పట్ల ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఎన్నికల పరిశీలకులకు వివరించారు. దీనిలో ప్రకాశం జిల్లా ఎస్పీ మలికాగర్గ్, బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్, బాపట్ల జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు, ప్రకాశం ఏఎస్‌పీ నాగేశ్వరరావు, డీఆర్‌ఓ ఓబులేసు, ఇతర అధికారులు లక్ష్మీ శివజ్యోతి, సేతు మాధవన్, విశ్వేశ్వరరావు, సందీప్ కుమార్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

శింగరకొండ తిరునాళ్లకు పటిష్ట భద్రత

- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్
- క్యూలైన్లు, పార్కింగ్, ప్రభలు ఏర్పాటు చేసే ప్రదేశాలను పరిశీలించిన ఎస్పీ
- 700 మంది పోలీసులతో బందోబస్తు



దేవాలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

అద్దంకిరూరల్: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రధాన తిరునాళ్ల మంగళవారం జరగనున్న నేపథ్యంలో సోమవారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ శింగరకొండ క్షేత్రాన్ని సందర్శించారు. టీటీడీ కల్యాణ మండపంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ తిరునాళ్ల ప్రశాంతంగా నిర్వహించేందుకు పట్టిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దేవాలయ ప్రాంగణ పరిసరాలు, ప్రవేశ మార్గాలు, క్యూలైన్లు, పార్కింగ్ స్థలాలు, ప్రభలు ఉండే స్థలాలను, ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసే స్థలాలను పరిశీలించారు. ట్రాఫిక్ ఇంబ్బందులు తలెత్తకుండా ప్రణాళికబద్ధమైన చర్యలు తీసుకోవాలన్నారు. తిరునాళ్ల ప్రశాంతంగా జరిగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంగా పనిచేయాలన్నారు. 4 లక్షలకు పైగా భక్తులు తిరునాళ్లకు వచ్చే అవకాశం ఉన్నందున ప్రశాంతంగా నిర్వహించేందుకు 700 మందిని నియమించి బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా తొలుత ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బీసీహెచ్ గరటయ్య, చీరాల డీఎస్పీ పీ.శ్రీకాంత్, డీఎస్‌డీ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్, అద్దంకి సీఐ రోశయ్య అద్దంకి, మేదరమెట్ల, ఎస్సైలు, దేవస్థాన ఈఓ సుభద్ర, పాలక మండలి అధ్యక్షుడు కోట శ్రీనివాసకుమార్, సభ్యులు, శింగరకొండ పాలెం సర్పంచ్ తిరుపతయ్య పాల్గొన్నారు.

మహిళలు ఉన్నతంగా రాణించాలి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ డీవీవీఎస్ సోమయాజులు, చిత్రంలో జస్టిస్ వి.సుజాత, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, పీడీజే పార్థసారథి, జీబీఏ ప్రెసిడెంట్ పి.వెంకటేశ్వర్లు

గుంటూరులీగల్: మహిళలు ఉన్నతంగా రాణించి హక్కులను సాధించుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి, గుంటూరు జిల్లా పోర్టుపోలియో న్యాయమూర్తి జస్టిస్ డీవీవీఎస్ సోమయాజులు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమానికి జీబీఏ లేడీ రిప్రజెంటేటివ్ ఎం.నాగలక్ష్మి అధ్యక్షత వహించారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వి.సుజాత, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప అంతర్జాతీయ మహిళా దినోత్సవం గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి, జిల్లా జడ్జిలు, సబ్ కోర్టు జడ్జిలు, మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తులు, జీబీఏ ప్రెసిడెంట్ పాలడుగు వెంకటేశ్వర్లు, జీబీఏ కార్యవర్గం, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తులకు ఘన స్వాగతం

గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొనేందుకు గుంటూరు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి, గుంటూరు జిల్లా పోర్టుపోలియో జడ్జి జస్టిస్ డీవీవీఎస్ సోమయాజులు, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వి.సుజాత, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాపలకు సోమవారం సాయంత్రం అధికారులు ఘన స్వాగతం పలికారు. రహదారులు, భవనాల శాఖ అతిథి గృహం వద్ద జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్, నాలుగో అదనపు జిల్లా కోర్టు, ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి రామగోపాల్, రెండు, మూడు అదనపు జిల్లా కోర్టుల జడ్జిలు సత్యవతి, అర్చన, డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి రత్నకుమార్, ఒకటవ ఏఎంఎం, ప్రోటోకాల్ జడ్జి జియావుద్దీన్, గుంటూరు ఆర్డీవో ప్రభాకర్‌రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి సాదరంగా స్వాగతం పలికారు.

ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్

చిలకలూరిపేట: ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. ఈ నెల 15వ తేదీన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రారంభించేందుకు పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఇతర ఉన్నతాధికారులతో కలసి గ్రామంలో సోమవారం పర్యటించారు. ముందుగా డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్ సందర్శించి సభ ఏర్పాటుకు సమీపంలోని పంట పొలాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశించారని చెప్పారు. ఈ నేపథ్యంలో 15వ తేదీన లింగంగుంట్ల గ్రామానికి సీఎం విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పా రు. గ్రామీణ ప్రజలకు మెరుగైన ఆరోగ్యసేవలు కల్పించాలన్న సీఎం వైఎస్ జగన్ ఆలోచనల నుంచి ఈ కార్యక్రమం పుట్టిందని చెప్పారు. ఇందుకు అనుగుణంగా పూర్తిస్థాయిలో అమలుకు అన్ని వనరులు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు అన్ని రకాల మందులు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో పెంచినట్లు వెల్లడించారు.


జోనల్ ఇన్‌చార్జుల నియామకం

ఉత్తర్వులు విడుదల చేసిన వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం



నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాల జోనల్ ఇన్‌చార్జీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల జోన్‌కు యూత్ విభాగ జోనల్ ఇన్‌చార్జిగా మాచర్లకు చెందిన పార్టీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి నియమితులయ్యారు. రైతు విభాగం ఇన్‌చార్జిగా ఒంగోలుకు చెందిన ఎం.సుబ్బారెడ్డి, బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జిగా కొండెపికి చెందిన బొట్ల రామారావు, వైఎస్సార్ టీయూసీ జోనల్ ఇన్‌చార్జిగా ఒంగోలుకు చెందిన కేశినేని వెంకటసుధాకరరెడ్డి, పంచాయతీరాజ్ వింగ్‌కు ఇన్‌చార్జిగా కొండెపికి చెందిన వాకా వెంకటరెడ్డి, ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జిగా నరసరావుపేటకు చెందిన మాజీ కౌన్సిలర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, మైనార్టీసెల్ ఇన్‌చార్జిగా ఒంగోలుకు చెందిన సయ్యద్ జలీల్, స్టూడెంట్ వింగ్ జోనల్ ఇన్‌చార్జిగా నరసరావుపేటకు చెందిన గోగుల మనోహరయాదవ్ నియమితులయ్యారు. వికలాంగుల విభాగ జోనల్ ఇన్‌చార్జిగా యర్రగొండపాలెంకు చెందిన మాలపోలు శ్యామ్, వైఎస్సార్ సేవాదళ్ ఇన్‌చార్జిగా గూడురుకు చెందిన మండ్ల రాజేష్‌కుమార్, డాక్టర్ సెల్ జోనల్ ఇన్‌చార్జిగా ఒంగోలుకు చెందిన డాక్టర్ జీవన్, వాణిజ్య విభాగ జోనల్ ఇన్‌చార్జిగా గురజాలకు చెందిన మాసెట్టి వెంకటేశ్వర్లు, కల్చరల్ సెల్ జోనల్ ఇన్‌చార్జిగా ఒంగోలుకు చెందిన బొట్ల సుబ్బారావు, పబ్లిసిటీ వింగ్ ఇన్‌చార్జిగా పెదకూరపాడుకు చెందిన కన్నా హనుమంతరావు, మహిళా విభాగ జోనల్ ఇన్‌చార్జిగా ఒంగోలుకు చెందిన బాడుగ ఇందిర, గ్రీవెన్స్ సెల్ జోనల్ ఇన్‌చార్జిగా ఒంగోలుకు చెందిన పులుసు సురేష్, వీవర్స్ వింగ్ ఇన్‌చార్జిగా చిలకలూరిపేటకు చెందిన అవ్వారు అన్నపూర్ణ నియమితులయ్యారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 543.40 అడుగుల వద్ద ఉంది. ఇది 195.4548 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 10,040, ఎడమకాలువకు 8,807, ఎస్‌ఎల్‌బీసీకి 2,200, వరదకాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 21,367 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 1,673 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 822.60 అడుగుల వద్ద ఉంది. ఇది 42.8047 టీఎంసీలకు సమానం.

నిర్ణీత సమయంలో అర్జీలు పరిష్కరించాలి

డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ అర్జున్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అర్జున్, అధికారులు

బాపట్లఅర్బన్: జిల్లాలో స్పందన అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ అర్జున్ సూచించారు. సోమవారం బాపట్ల కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్ మాట్లాడుతూ జిల్లాలో అధికారులు స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాలను పూర్తి చేయడానికి అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. గృహ నిర్మాణాలు ప్రారంభించడానికి డ్వాక్రా గ్రూపుల మహిళలకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్, మత్స్య శాఖ జేడీ సురేష్, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, వ్యవసాయ శాఖ జేడీ అబ్దుల్ సత్తార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయమ్మ, పౌర సరఫరాల శాఖ డీఎం శ్రీలక్ష్మి, డీఎస్ఓ విలీమ్స్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉన్నప్పుడే ఉజ్వల భవిష్యత్

- మాదక ద్రవ్యాలకు బానిసలైతే జీవితం అంధకారమే
- ఉన్నత లక్ష్యాల దిశగా యువత అడుగులు వేయాలి
- సంకల్పం కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఎస్పీ మల్లికాగార్గ్, జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రకాశం, బాపట్ల జిల్లాల ఎస్పీలు మల్లికాగార్గ్, వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: డ్రగ్స్‌కు దూరంగా ఉన్నప్పుడే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రకాశం జిల్లా ఎస్పీ మల్లికాగార్గ్ అన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలోని విద్యార్థులకు మాదక ద్రవ్యాల వాడకం వలన కలిగే అనర్థాలపై అవగాహనలో భాగంగా సోమవారం సాయంత్రం సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ప్రకాశం, బాపట్ల జిల్లాల ఎస్పీలు జ్యోతి ప్రజ్వలన చేసి, డ్రగ్స్ నివారణ పోస్టర్లు ఆవిష్కరించి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రకాశం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో, ఉన్నతమైన భావజాలంతో జీవించాలన్నారు. యువతకు వాటి వల్ల కలిగే నష్టాల గురించి వివరించి, వారిని ఆ మురికి కూపం నుంచి బయటకి తీసుకు వచ్చి, డ్రగ్స్ రహిత జిల్లాగా తయారు చేయాలన్నారు. క్రిమినల్ రికార్డ్స్‌లో పేరు నమోదైతే కనీసం ప్రైవేట్ జాబ్ కూడా రాదని, విదేశాలకు వెళ్లే అవకాశాలు కోల్పోతారని అన్నారు. బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ బాపట్లలో కూడా కొన్ని డ్రగ్స్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. విద్యార్థులు కాలేజీకి వచ్చేటప్పుడు మంచి వాతావరణం నుంచి వస్తారని, కాలేజీకి వచ్చిన తర్వాత కొత్త పరిచయాలు, స్నేహాలు, అలవాటు అవుతాయని ఈ క్రమంలో కొందరికి డ్రగ్స్ కూడా అలవాటు అవుతున్నాయని అన్నారు. ఎవరైనా ఆ మురికి కూపం నుంచి బయట పడాలంటే పోలీస్ శాఖ నుంచి సహాయం చేస్తామని, కౌన్సెలింగ్ ఇవ్వడం, డ్రగ్ డి–అడిక్షన్ సెంటర్‌లో వారికి కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు, యూనివర్సిటీ హెడ్ ఎస్.రత్నకుమారి, సెబ్ ఏఈఎస్ నరసింహారావు, బాపట్ల డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, ఎస్‌బీ సీఐ ఎ. శ్రీనివాసరావు, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

లక్ష్యం చేరేదెలా!

- ముగింపునకు వచ్చిన ఆర్థిక సంవత్సరం
- జిల్లాలో బాపట్ల ద్వితీయ స్థానం
- వేగవంతంగా పన్నుల వసూలు



బాపట్ల పురపాలకసంఘ కార్యాలయం

బాపట్లఅర్బన్: ఆర్థిక సంవత్సరం ముగింపునకు ఇంకా ఇరవై రోజులే ఉంది. పన్నుల వసూలు మందకొడిగా సాగుతోంది. పన్నుల వసూలులో బాపట్ల మునిసిపాలిటీ జిల్లాలో ద్వితీయ స్థానంలో ఉంది. ప్రథమ స్థానంలో చీరాల నిలిచింది. లక్ష్యాన్ని చేరుకునేందుకు బాపట్ల కమిషనర్ భానుప్రతాప్ ఆధ్వర్యంలో అధికారులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు.

ఇదీ వసూళ్ల లెక్క..

బాపట్ల మునిసిపాలిటీ జనాభా లక్ష మంది ఉన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం పన్ను లక్ష్యం రూ.5.77 కోట్లు. ఇప్పటి వరకు రూ.3.97 కోట్లు వసూలయ్యాయి. నీటి పన్ను అసెస్‌మెంట్లు 8652 కాగా పన్ను లక్ష్యం రూ.67.74 లక్షలుగా ఉంది. ఇందులో ఇప్పటి వరకు రూ.45 లక్షలు వసూలు చేశారు. ఖాళీ స్థలం పన్నుల అసెస్‌మెంట్ 1816 కాగా పన్నుల లక్ష్యం రూ.76.22 లక్షలుగా ఉంది. ఇందులో ఇప్పటివరకు రూ.35.84 లక్షలు వసూలైంది. మొత్తం మీద పన్నుల వసూళ్లు రూ.7.20 కోట్లు లక్ష్యంకాగా రూ.2.43 కోట్ల పన్నులు రాబట్టారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటు

బాపట్ల మునిసిపాలిటీలో 20 సచివాలయాలు ఉన్నాయి. మునిసిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిని కమిషనర్ భానుప్రతాప్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేశారు. పన్నుల వసూళ్ల కోసం ప్రణాళిక రూపొందించారు. ఎప్పటి నుంచో మునిసిపాలిటీకి పన్నులు చెల్లించకుండా గుదిబండలా మారిన మొండి బకాయిల వసూళ్లపై దృష్టి సారించారు. మొండి బకాయిదారులను గుర్తించి అవసరమైతే నోటీసులు ఇవ్వడం, సీజ్ చేయడం వంటి పద్ధతుల ద్వారా పన్నులు రాబడుతున్నారు.

ప్రథమ స్థానమే లక్ష్యం



బాపట్ల జిల్లాలోని మునిసిపాలిటీల్లో పన్ను వసూళ్లలో బాపట్ల ద్వితీయ స్థానంలో ఉంది. పన్నుల వసూళ్ల కోసం ప్రతి రోజూ సమీక్షిస్తున్నాం. ఎక్కడ తక్కువగా ఉందో పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. మొండి బకాయిదారుల వద్ద పన్నుల వసూళ్లకు అన్ని రకాల పద్ధతులు వినియోగిస్తున్నాం. ప్రత్యేక కార్యాచరణ ద్వారా పన్నుల వసూళ్ల లక్ష్యం చేరుకునేందుకు మరింత శ్రమిస్తాం. జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచేందుకు ప్రయత్నిస్తాం.

–ఎ.భానుప్రతాప్, కమిషనర్

ఫిర్యాదులపై వెంటనే స్పందించండి

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక–స్పందన (గ్రీవెన్స్) జరిగింది. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. స్పందనకు వచ్చే ఫిర్యాదిదారుల అర్జీలను నిర్ణీత వేళల్లో పరిష్కరించాలని ఎస్పీ జూమ్ ద్వారా పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు (పరిపాలన) కె.సుప్రజ, ఎ.శ్రీనివాస రావు (క్రైం), డీఎస్పీ ప్రకాష్‌బాబు (క్రైం)లు కూడా అర్జీలు స్వీకరించారు. సోమవారం స్పందనకు మొత్తం 112 ఫిర్యాదులు వచ్చాయి.

వీధి కుక్కల సమస్య పరిష్కారానికి చర్యలు



జంతు ప్రేమికులతో సమావేశమైన మేయర్ కావటి, కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగర ప్రజలకు వీధి కుక్కల వలన సమస్యలు తలెత్తకుండా నగర పాలక సంస్థ పటిష్ట చర్యలు తీసుకోనున్నదని, వారం రోజుల్లో నగరంలోని వీధి కుక్కలకు మాస్ యాంటి ర్యాబిస్ వ్యాక్సినేషన్ చేయించేందుకు చర్యలు తీసుకున్నామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. సోమవారం మేయర్ చాంబర్‌లో కమిషనర్ కీర్తి చేకూరి, పశు సంవర్ధక శాఖ అధికారులు, నగర పాలక సంస్థ ప్రజారోగ్యాధికారులు, జంతు ప్రేమికులతో కలిసి వీధి కుక్కల నియంత్రణ, ర్యాబిస్ వ్యాక్సినేషన్ పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలో వీధి కుక్కల వలన వచ్చే సమస్యల పై ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, త్వరలో ఈ సమస్య పరిష్కారమయ్యేలా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. వీధి కుక్కలకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ చేసేలా మాస్ డ్రైవ్ చేపట్టనున్నామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగరంలో సుమారు 20 వేలకు పైగా ఉన్న వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయటానికి ఇద్దరు పశు వైద్యులను కేటాయించాలని పశుసంవర్ధక శాఖకు లేఖ రాశామని, త్వరలో వైద్యులను కేటాయిస్తారన్నారు. సమావేశంలో ఎం.హెచ్.ఓ భాను ప్రకాష్, ఎస్ఎస్ లు రాంబాబు, ఆనంద్ కుమార్, పశుసంవర్ధక శాఖ అధికారులు, జంతు ప్రేమికులు సురేష్ కుమార్ జైన్, ప్రదీప్ కుమార్, సురేష్ జాగు, తేజోవంత్, నరసింహా రావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఉరివేసుకున్న దంపతులు

- ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు మృతి చెందిన భార్య
- భర్తను ఆసుపత్రికి తరలింపు



మృతురాలు సుకన్య

నిజాంపట్నం: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య, భర్తలు ఉరివేసుకున్న సంఘటన మండలంలోని ఆముదాలపల్లి ఎస్సీ కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఆముదాపల్లి ఎస్సీ కాలనీకి చెందిన కట్టుపల్లి సుకన్య (26), ప్రవీణ్‌లకు 11 సంవత్సరాల క్రితం వివాహమైంది. సోమవారం భార్య, భర్త ఇద్దరూ గొడవపడ్డారు. భర్త ప్రవీణ్ ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన సమయంలో సుకన్య ఇంట్లో ఉరి వేసుకుంది. మరికొద్ది సేపటికే భర్త ప్రవీణ్ ఇంటి చావిట్లో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు చూసి వీరిద్దరినీ ఆటోలో నిజాంపట్నం వైద్యశాలకు తీసుకువెళ్లారు. సుకన్య వైద్యశాలకు తీసుకువెళ్లేలోపే మృతి చెందింది. ప్రవీణ్‌ను మెరుగైన చికిత్సకోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్ళారు. మృతురాలి తల్లి రత్నకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

నేత్రపర్వం.. మల్లేశ్వరుని రథోత్సవం



విద్యుత్ కాంతుల వెలుగులో రథం



రథోత్సవంలో పాల్గొన్న మంత్రి నాగార్జున, పక్కన బౌడ చైర్మన్ దేవినేని తదితరులు

- భట్టిప్రోలు పురవీధులలో ఊరేగిన భ్రమరాంబ మల్లేశ్వరస్వామి
- రథోత్సవంలో పాల్గొన్న మంత్రి నాగార్జున

భట్టిప్రోలు: హరహర మహాదేవ..శంభో శంకర.. అంటూ భక్తులు తన్మయత్వంతో శివనామస్మరణ చేస్తుంటే భట్టిప్రోలులో సోమవారం భ్రమరాంబ మల్లేశ్వరస్వామి రథం ముందుకు కదిలింది. స్వామివారి బ్రహ్మోత్సవాలలో కీలక ఘట్టమైన రథోత్సవం నేత్ర పర్వంగా కొనసాగింది. రథోత్సవానికి ముందు యాజ్ఞీకులు కౌతా సత్య మెంకట నాగరాజేష్ శర్మ రథాంగ హోమం నిర్వహించారు. పూజా కార్యక్రమంలో జగ్గారపు సూర్యనారాయణ–సామ్రాజ్యం దంపతులు పాల్గొన్నారు. రథం దేవాలయం వద్ద నుంచి బయలు దేరి పురవీధుల గుండా స్వామి వారి అత్తవారి ఇల్లు ఐన అద్దేపల్లి అమ్మవారి చెట్టు వద్ద కు వెళ్లి తిరిగి ఆలయానికి చేరుకుంది. దారిపొడవున భక్తులు స్వామి వారికి కానుకలు, పండ్లు, పూలు, టెంకాయలు సమర్పించారు.

మంత్రి నాగార్జున ప్రత్యేక పూజలు...

రథోత్సవంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర మేరుగ నాగార్జున, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బౌడ) చైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావు, గ్రామ సర్పంచి దారా రవి కిరణ్మయి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, ఉప సర్పంచి బూర్లె రామ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు కొతరపు పద్మావతి, సూరేపల్లి పీఏసీఎస్ చైర్ పర్సన్ గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు(చినబుజ్జి), అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బండారు శ్రీనివాస రావు, ఉక్కడాల ఆనంద్, దారా చెన్నయ్య, మద్దుల గిరిధర్,యునెస్కో వాస్తు పండిట్ వంగర చలమయ్య, తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రేపల్లె డీఎస్పీ మురళీ కృష్ణ ఆధ్వర్యంలో వేమూరు సీఐ కె. వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో వేమూరు, చుండూరు, సర్కిల్ పరిధిలోని ఏడుగురు ఎస్ఐలు, స్పెషల్ పార్టీ సిబ్బంది 100 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, బూర్లె సుబ్బారావు, శనగపల్లి శ్రీనివాస ప్రసాదగుప్తా, నంబూరు నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధచూపాలి

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దు.. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం బాగుంటుంది అంటూ సూచించారు జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐపీఎస్ ఆఫీసర్స్ వైఫ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఒమెగా ఆసుపత్రి సంయుక్తంగా సోమవారం డీపీఓ ఆవరణలోని పోలీస్ యూనిట్ ఆసుపత్రిలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ, ఒమేగా ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

698 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



స్వర్ణలో రేషన్ బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్న అధికారులు

కారంచేడు: బియ్యం అక్రమార్కులు రోజు రోజుకీ మితిమీరిపోతున్నారు. నిరంతరం పోలీసుల పర్యవేక్షణ ఉన్నా కళ్లుగప్పి ప్రజలకు సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. కారంచేడు మండలంలోని స్వర్ణ గ్రామంలోని ఒక రైస్ మిల్లులో అక్రమ రేషన్ బియ్యం నిల్వలున్నట్లు అందిన సమాచారంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. ఆదివారం అర్ధరాత్రి తరువాత జరిగిన ఈ దాడుల్లో సుమారు 600 బ్యాగ్‌ల బియ్యం రాసులుగా పోసి ఉన్నట్లు గుర్తించారు. ఒంగోలు, బాపట్ల, గుంటూరు జిల్లాలకు చెందిన అధికారులు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీహరి ఆధ్వర్యంలో ఈ దాడులు చేశారు. దీంతో బియ్యాన్ని బస్తాలలో నింపి స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

వేటపాలెంలో 98 బస్తాలు..

వేటపాలెం: బాపట్ల జిల్లా వేటపాలెం మండలం పందిళ్లపల్లి క్రాస్ రోడ్ వద్ద అక్రమంగా మినీ లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని చీరాల రూరల్ సీఐ మల్లికార్జునరావు సోమవారం తెల్లవారు జామున స్వాధీనం చేసుకున్నారు. మినీ లారీని పోలీస్ స్టేషన్‌కి తరలించి పరిశీలించగా 98 బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. మినీ లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వేటపాలెం, పందిళ్లపల్లి గ్రామాల్లోని రేషన్ డీలర్ల వద్ద బియ్యం కొనుగోలు చేసి పర్చూరు నియోజకవర్గం లోని రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు తేలింది. వేటపాలెం ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ నెల మూడో తేదీన పౌరసరఫరాల శాఖ అధికారులు పందిళ్లపల్లి వద్దనే మినీ లారీని పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు. అయినప్పటికీ రేషన్ మాఫియాపై కేసులు పెట్టినా యథేచ్ఛగా రేషన్ అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు.

పాఠశాలల్లో ట్యాబ్‌ల వినియోగం తప్పనిసరి

- ఉపయోగించకుంటే సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలే బాధ్యులు
- ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు, పక్కన డీఈఓ పీవీజే రామారావు

చెరుకుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చి అమలు చేస్తుందని వాటిని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకునే విధంగా ఉపాధ్యాయులు పని చెయ్యాలని ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు సూచించారు. మండలంలోని గుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం రేపల్లె నియోజకవర్గ పరిధిలోని చెరుకుపల్లి, నగరం, నిజాంపట్నం, రేపల్లె మండలాల ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, సీఆర్‌పీలతో ఆర్జేడీ, డీఈఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ బైజూస్ సంస్థ ట్యాబ్ ద్వారా అందిస్తున్న విద్యా విధానాన్ని 8వ తరగతి విద్యార్థులు సక్రమంగా సద్వినియోగం చేసుకునే విధంగా ఎంఈఓలు, హెచ్‌ఎంలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇప్పటికీ ట్యాబ్‌లు అందించి 70రోజులు అయినా కొన్ని పాఠశాలల్లో తక్కువ సమయం ఉపయోగిస్తున్నారని ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయుడు క్రమం తప్పకుండా ప్రతిరోజు ఒక్క గంటపాటు ట్యాబ్ ఉపయోగించాలని లేని పక్షంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలే బాధ్యత వహించవలసి ఉంటుందన్నారు. అనంతరం బాపట్ల జిల్లా విద్యా శాఖ అధికారి పీవీజే రామారావు మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీన ప్రతి పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. డిప్యూటీ డీఈఓ జి.వెంకటేశ్వర్లు, ఎంఈఓలు నవీన్‌కుమార్, పులి లాజర్, హరిబాబు, వివిధ పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

తెనాలిలో బేల్దారీ కూలీ హత్య

తెనాలి రూరల్: పట్టణంలో బేల్దారీ కూలీ పనులకు వెళ్లే వ్యక్తి హత్యకు గురయ్యాడు. తనతో పాటు పనులకు వచ్చే మరో కూలీ దారుణానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం... వినుకొండ మండలం గోకనకొండకు చెందిన గండికోట అంకారావు (40) కొన్నేళ్ల కిందట తన కుటుంబంతో కలసి తెనాలి వచ్చి బేల్దారీ పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తెనాలి బస్టాండ్ వంతెన నుంచి బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో సుమారు నాలుగు నెలలుగా నివసిస్తున్న వేముల నాగరాజుతో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ ప్రతిరోజు సాయంత్రం మద్యం సేవిస్తుండే వారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి అంకారావు నాగరాజు ఇంట్లో అతనితో కలసి మద్యం సేవిస్తున్నాడు. ఇద్దరి మధ్య వాదన జరగడంతో నాగరాజు కత్తిపీట చెక్కతో అంకారావుపై దాడి చేయగా అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. సమాచారం అందుకున్న టూ టౌన్ సీఐ ఎస్. వెంకట్రావు తమ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి, మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

కబడ్డీ జాతీయ స్థాయి జట్టుకు ఫణిదం విద్యార్థి



నాగార్జున

సత్తెనపల్లి: జాతీయ స్థాయి అండర్ –14 కబడ్డీ పోటీలకు పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ఫణిదం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి డి.నాగార్జున ఎంపికయ్యాడు. చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి కబడ్డీ అండర్ –14 బాలుర విభాగంలో నాగార్జున అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో జరగబోయే అండర్ –14 కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. జాతీయ క్రీడల్లో ఎంపిక కావడానికి కష్టపడి సాధన చేసిన విద్యార్థి నాగార్జునను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు చిన్నయ్యలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్, యోహాన్ ఉన్నారు.

'బడుగు వికాసం' కింద బొలేరో కారు అందజేత



లబ్ధిదారునికి కారు తాళాలను అందజేస్తున్న కలెక్టర్, జేసీ అధికారులు

నరసరావుపేట: నిరుద్యోగ యువత క్రమశిక్షణతో ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జేసీ ఎ.శ్యామ్‌ప్రసాదు సూచించారు. నవోదయం కార్యక్రమంలో ఉపాధికోసం దరఖాస్తు చేసుకున్న రాజుపాలెం మండలం, చోటపాపాయపాలెం గ్రామానికి చెందిన వంకుడువతు రాంబాబు నాయక్‌కు సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో బొలేరో వాహనం అందజేశారు. వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారునికి పిడుగురాళ్ల స్టేట్ బ్యాంక్ ఇండియా అధికారులు వాహనం కొనుగోలు చేసేందుకు రూ.16.50లక్షల రుణం మంజూరు చేశారు. దీనిలో లబ్ధిదారునికి 45శాతం సబ్సిడీ మంజూరవుతుందని నవోదయ నోడల్ అధికారి సంజీవరావు తెలిపారు. వాహనాన్ని కలెక్టర్, జేసీలు ప్రారంభించారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఓబులు నాయుడు, జిల్లా ఎల్‌డీఎం వెంకటేశ్వర్లు, ఉద్యానశాఖ అధికారి బీజే బెన్ని, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి వరలక్ష్మి, డీఆర్డీఏ ప్రాజెక్ట్ అధికారి బాలు నాయక్, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి వెంకటేశ్వరరావు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

గంగపుత్రులపై ప్రత్యేక దృష్టి

- ముత్తాయపాలెంలో బజరంగ్ ఫౌండేషన్ నేత్ర వైద్యశిబిరం
- 14 తీరప్రాంత గ్రామాల్లోని 702 మందికి పరీక్షలు
- ప్రారంభించిన ఎమ్మెల్యే కోన రఘుపతి
- తీరప్రాంతాలకు మరిన్ని సేవలందిస్తాం : అంబటి మురళీకృష్ణ



సంక్షేమాంధ్ర రథసారథి సీఎం వైఎస్ జగన్ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులతో అంబటి మురళీకృష్ణ

బాపట్లటౌన్: పేదల అభ్యున్నతికి జగన్నామ సంక్షేమం పేరుతో బజరంగ్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. మండలంలోని ముత్తాయపాలెం గ్రామంలో సోమవారం బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత నేత్రవైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రారంభించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ అన్ని ఇంద్రియాల్లో నేత్రాలు అత్యంత ప్రధానమైనవన్నారు. తీరప్రాంత గ్రామాల్లోని ప్రజలకు ఉచిత నేత్రవైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. వైద్యపరీక్షల అనంతరం వారం వ్యవధిలో అవసరమైన ప్రతి ఒక్కరికి ఉచితంగా కళ్లజోళ్లు కూడా అందించడం హర్షనీయమన్నారు.

సీఎం జగన్ సంక్షేమ పాలనే స్ఫూర్తి..

బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలననే స్ఫూర్తిగా తీసుకొని నిరుపేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఒక అనిర్వచనీయమైన భావోద్వేగంతో ఈ జగన్నామ సంక్షేమ సేవా సంవత్సరాన్ని కొనసాగిస్తున్నామన్నారు. ఇప్పటివరకు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ఆరు శిబిరాలను ఏర్పాటు చేసి, సుమారు 6000 మందికి నేత్ర వైద్య సేవలను అందించామన్నారు. పేదరికం, నిరక్షరాస్యత వంటి సమస్యలతో సతమతమయ్యే గంగపుత్రులకు అండగా నిలవాలని బజరంగ్ ఫౌండేషన్ భావించి, బాపట్ల మండలంలోని తీర ప్రాంత గ్రామాలకు సేవలందించేందుకు ఈ శిబిరాన్ని ప్రత్యేకంగా ఏర్పాటుచేశామన్నారు. ఈ శిబిరంలో 14 తీర ప్రాంత గ్రామాల్లోని 702 మందికి పరీక్షలు చేసి, అవసరమైన వారికి వచ్చే వారం కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. రాబోయే రోజుల్లో ఇంకో 43 శిబిరాలను ఏర్పాటు చేయడం ద్వారా మొత్తంగా 51 సేవా కార్యక్రమాలను నిర్వహించి జగన్నామ సంక్షేమ సంవత్సరాన్ని పూర్తి చేస్తామన్నారు. బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గంలో మరో రెండు మూడు శిబిరాలను కూడా ఏర్పాటు చేయాల్సిందిగా శాసనసభ్యులు కోన రఘుపతి కోరిన మీదట, సాధ్యమైనంత త్వరలో ఈ శిబిరాలను నిర్వహిస్తామన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పరీక్ష ప్యాడ్లు, లంచ్ బాక్స్‌లు పంపిణీ..

జగన్నామ సంక్షేమ కార్యక్రమంలో భాగంగా నేత్ర వైద్యశిబిరంతోపాటు పరిసర ప్రాంతాలలోని నాలుగు ప్రభుత్వ పాఠశాలల్లోని 620 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను, 63 మంది అంగన్‌వాడీ పిల్లలకు పలకలను, ఉపాధ్యాయులకు లంచ్ బాక్సులను, నారీ ఋతువులో భాగంగా 104 మంది కిశోర బాలికలకు శానిటరీ నాప్‌కిన్లను అందజేశారు. అనంతరం 25 మంది వలంటీర్లకు ప్రభుత్వ పథకాలపై మరింతగా అవగాహన కలిగించడం కోసం ప్రత్యేకంగా పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. బాపట్ల ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, వివేకా సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు అంబటి మురళీకృష్ణ, ధృతి సంస్థ నిర్వాహకుడు కళ్లం హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు.